కిసాన్
నవతెలంగాణ

తెలంగాణ జిల్లాల్లో సుమారుగా 44 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ప్రధాన ఆహారపు పంట వరి. ఇటీవలి కాలంలో వస్తున్న వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, ఆలస్యంగా కురిసే వర్షాల వల్ల వరి విస్తీర్ణం క్రమంగా తగ్గుతున్నది. రానురాను వ్యవసాయ కార్మికుల సమస్య, నీటి కొరత, చీడపీడల వల్ల వరి పంట సాగు సంక్షోభంలో పడుతుంది. దీనికి తోడు చౌడు, యాసంగిలో చలివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సాగు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక పరిజ్ఞానం ముఖ్యంగా మధ్య, స్వల్పకాలిక, కొత్త రకాలు, వివిధ వరిసాగు పద్ధతులు, చౌడు, చలి, దోమకాటుకు రూపొందించిన యాజమాన్య పద్ధతులు తెలంగాణలో వరి ఉత్పాదక శక్తిని పెంచడమే కాకుండా ఖర్చులను కూడా తగ్గిస్తాయి. వరి పంటను నీటి వసతి, కాలాలను, నేల స్వభావాన్ని బట్టి వివిధ రకాలుగా పండించవచ్చు.

ఉత్పాదకత పెంచేలా...

నేలలు: సమస్యాత్మక నేలలు (చౌడు, క్షారము, ఆమ్లము) తప్ప సాధారణంగా వరి సాగుకు అన్ని నేలలు అనుకూలం. నీటి ముంపుకు గురయ్యే భూములు సాగుకు అనుకూలం కాదు. నీరు అధికంగా అవసరమయ్యే చౌక, దుబ్బ నేలల్లో వేరే పంటలు వేసుకోవడం మంచిది.

పంట కాలాలు: వానాకాలం – జూన్ నుంచి డిసెంబరు వరకు, యాసంగి– నవంబరు నుంచి ఏప్రిల్ వరకు దమ్ముచేసి నేరుగా విత్తే పద్ధతిలో స్వల్పకాలిక రకాలు ఎంచుకుని ఆగస్టు 10 వరకు విత్తుకోవచ్చు. నాటే పద్ధతిలో ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకోవచ్చు. కానీ నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో ఆగస్టు 30 వరకు నాటిన వరిలో మంచి దిగుబడులు వస్తాయి. తరువాత నాటితే చలికి దిగుబడి తగ్గుతుంది. చలి తక్కువగా ఉండే ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి, యాదాద్రి జిల్లాల్లో సెప్టెంబరు 10 వరకు కూడా నాటుకోవచ్చు.

రకాలు

దీర్ఘకాలిక రకాలు (150 రోజుల పరిమితిగల) : సాగు చేయడం వల్ల ఎక్కునీరు, విద్యుత్ వాడకమే కాకుండా పచ్చిరొట్ట పంటలు వేసి భూమిలో కలియదున్నడానికి సమయం ఉండదు. అంతేకాకుండా చెరువులు, నీటి పారుదల ప్రాజెక్టు కింద ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల పంట చీడపీడలకు గురై పూత సమయంలో చలి వల్ల తాలు గింజలు ఏర్పడి దిగుబడులు తగ్గుతాయి. అందువల్ల తెలంగాణ రాష్ట్రంలో మధ్య, స్వల్పకాలిక రకాలు వేసుకోవడం మంచిది.

వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు సిఫారసు చేసిన రకాలు

ఉత్తర తెలంగాణ: సాంబమసూరి, జగిత్యాల మసూరి, ప్రాణహిత, పొలాస ప్రభ, జగిత్యాల సన్నాలు, తెలంగాణ సోన, అంజన, బతుకమ్మ, కూనారం సన్నాలు, యంటియు–1010, మానేరుసోన, జగిత్యాల సాంబ, ప్రత్యుమ్న.

మధ్య తెలంగాణ: సిద్ది, సాంబ మసూరి, సోమనాథ్, భద్రకాళి, సురేఖ, వరంగల్ సన్నాలు, వరంగల్ సాంబ, శీతల్, రామప్ప, తెలంగాణ సోన, బతుకమ్మ, కూనారం సన్నాలు, ఎర్రమల్లెలు, ప్రత్యుమ్న, వరాలు, యంటియు1010, యంటియు 1001.

దక్షిణ తెలంగాణ: సాంబ మసూరి, కృష్ణ, జగిత్యాల మసూరి, విజేత, బతుకమ్మ, కూనారం సన్నాలు, తెలంగాణ సోన, తెల్లహంస, నెల్లూరి మసూరి, యంటియు–1010, అంజన.

యాసంగిలో అన్ని స్వల్పకాలిక రకాలు వేసుకోవచ్చు. చలి ఉధృతినిబట్టి పంట కాలం 15 నుంచి 30 రోజుల వరకు పెరుగుతుంది. అందుకే చలికి ప్రత్యేక యాజమాన్యం పాటించాలి.

కొత్త రకాలు:

తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్15048) : ఇది ఆలస్యంగా నార్లు పోసుకునేందుకు అనుకూలమైన రకం. ఖరీఫ్ రైతులు జూన్ మొదటి వారంలో పచ్చిరొట్ట పైరులైన జనము, జీలుగ లేదా పెసర పంటలను సాగు చేసి జూలైలో ఈ రకాలను సాగు చేసుకోవాలి. రెండు కాలాలకు అనువుగా ఉండే ఈ రకం అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుని అధిక దిగుబడినిస్తుంది. సాంబ మసూరి కన్నా సన్న గింజ నాణ్యతతో తక్కువ నూక శాతంతో కలిగి ఉంటుంది.

విత్తన మోతాదు: ఎకరానికి నాటే పద్ధతికి దొడ్డు రకాలు 25 కిలోలు, సన్న రకాలు 20 కిలోలు.

విత్తనశుద్ధి: మెట్ట నారుమడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండజిమ్‌ను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారుమడులైతే లీటరు నీటికి 1 గ్రాము కార్బండజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి తరువాత మండె కట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలకు లీటరు ద్రావణం సరిపోతుంది. నిద్రావస్థను తొలగించడానికి లీటరు నీటికి తక్కువ నిద్రావస్థ 2 నుంచి 3 వారాలున్న విత్తనాలకైతే 6 నుంచి 3 మి.లీ, ఎక్కువ నిద్రావస్థ 4 నుంచి 6 వారాలు ఉన్న విత్తనాలకైతే 10 మి.లీ గాఢ నత్రికామ్లం కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి కడిగి మండెకట్టాలి.

నారుమడి పెంపకం

- నారుమడిని బాగా దున్ని రెండు మూడు సార్లు దమ్ము చేసి పదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాల్వలను ఏర్పాటు చేసి ఎత్తు నారుమడులను తయారు చేయాలి.
- రెండు గుంటల (5సెంట్లు) నారుమడికి 2 కిలోల నత్రజని (1కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12 నుంచి 14 రోజులకు 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడను లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయడం చాలా మంచిది.
- జింకు లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేటు కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- మెట్ట నారుమడిలో ఇనుప దాతు లోపాన్ని గమనిస్తే సరిచేయాలి. పంట, మొక్క వయసు, ఎదుగుదలను బట్టి 2 నుండి 5 గ్రా. అన్నబేధి0.5 నుండి 1 గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నారు పీకే ఏడు రోజుల ముందు గుంట నారుమడికి 2.5 సెంట్లకు 400 గ్రా.కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి పల్చగా చల్లి నీరందించాలి. అవసరాన్ని బట్టి మడిలో ఇతర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో రెండో దపా నత్రజనిని ఆలస్యంగా చేసి నారు ముదరకుండా చూడాలి. ఈ పరిస్థితులలో తామర పురుగులను నివారించుకోవాలి.

సమగ్ర పోషక యాజమాన్యం

పశువుల ఎరువు, కంపోస్టు, కోళ్ల ఎరువు వంటి సేంద్రియ ఎరువులను, రసాయనిక ఎరువులతో కలిపి వాడినట్టయితే భూసారాన్ని కాపాడుకుంటూ 20 నుంచి 25 శాతం వరకు నత్రజనిని ఆదా చేయవచ్చును. వరి పొలాల్లో నాటడానికి ముందు అపరాలు, జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైరును పెంచి భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరగడమే కాకుండా సుమారు 20 నుంచి 25 శాతం వరకు నత్రజని ఆదా చేసుకోవచ్చు. సజీవ ఎరువులైన నీటి ఆకుపచ్చనారు, అజొల్లా, అజోసైరిల్లమ్ ఫోస్పో బ్యాక్టీరియా మొదలగు జీవన ఎరువులను వాడి నత్రజని, భాస్వర మోతాదులను 10 నుంచి 20 శాతం తగ్గించవచ్చు.

కలుపు యాజమాన్యం

నాటిన 3 నుంచి 5 రోజుల్లోపు ఎకరానికి బ్యూటాక్లోర్ 1–1.5 లీ. లేదా ప్రెటిలాక్లోర్ 500–600 మి.లీ లేదా ఆక్సాడయార్జిల్ 35–40 గ్రా. లేదా బెన్ సల్ఫూరాన్ మిథైల్ 0.6శాతం, ప్రెటిలాక్లోర్ 6.0శాతం, 4కిలోల గుళికలు, పైరజోసల్ఫూరాన్ ఈథైల్ , ప్రెటిలాక్లోర్ 6.15 గుళికలు 4 కిలోలు లేదా 8–10 రోజుల లోపు పైరజోసల్ఫూరాన్ ఇథైల్ 80–100 గ్రా, 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

ప్రధాన శాస్త్రవేత్త (వరి)
వ్యవసాయ పరిశోధన సంస్థ
రాజేంద్రనగర్,
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర
వ్యవసాయ విశ్వవిద్యాలయం,హైదరాబాద్

వరికి అనుకూలమైన సమయం

1. నీటి వసతి కింద ముందుగా నారు పోయడానికి బావుల కింద	1. మే చివరి నుంచి జూన్ 20 వరకు	1. దీర్ఘకాలిక
2. సాధారణ పరిస్థితులలో కాల్వలు, చెరువులు, బావుల కింద	2. జూన్ 20 నుంచి జూలై 15 వరకు	2. మధ్య, స్వల్పకాలిక
3. ఆలస్యంగా నారు పోసుకునేందుకు చిన్న చెరువులు, నీరు తక్కువగా ఉన్న చోట	3. జూలై చివరి వరకు	3. స్వల్పకాలిక
4.ప్రత్యామ్నాయ పరిస్థితులలో మరీ ఆలస్యంగా	4. ఆగస్టు మొదటి వారం వరకు	4. అత్యల్పకాలిక

ధాన్యం తడవకుండా చూసుకోవాలి

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. పగటి ఉష్ణోగ్రతలు 39 నుంచి 43 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 31 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 22 నుంచి 29 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు. రబీ పంట కోతలను వాయిదా వేసుకోవాలి. కోసిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించకుండా వాయిదా వేసుకోవాలి. ఇప్పటికే మార్కెట్‌కు తరలించిన ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలి.

వరి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో కాండం తొలుచు పురుగు ఆశించడమైంది. నివారణకు 2గ్రా. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 0.4 మి.లీ క్లోరాంట్రినిల్‌ప్రోల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుతం చలి మంచు వాతావరణం కనుక అగ్గి తెగులు సోకుటకు అనుకూలం. తెగులను గమనించినట్టయితే నివారణకు ఎకరానికి 0.6గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మి.లీ కాసుగామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో కెండుసార్లు పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో పిందె రాలుట నివారణకు 0.25 మి.లీ ఎన్ఏఏ మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. మామిడిలో కాయ పరిమాణం పెరిగేందుకు 10 గ్రా. 13–0–45+1.25 గ్రా. బోరాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినట్టయితే నివారణకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 2 మి.లీ హెక్సాకొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మిరప: మిరపలో తామర పురుగు, నల్లి ఉధృతి గమనించినట్టయితే నివారణకు 1.5 గ్రా. డిఫెన్‌థయూరాన్ లేదా 2 మి.లీ క్లోర్‌ఫినాపిర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో బూడిద తెగుళ్ల వ్యాప్తికి అనుకూలం. నివారణకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ డైనోకాప్ లేదా 1 మి.లీ అజాక్సిస్ట్రోబిన్ లేదా 0.4 గ్రా. మైక్లోబ్యుటానిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కూరగాయలు: ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో ఆకుమాడు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రోఫికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆలస్యంగా నాటిన టమాట పైరులో శనగ పచ్చ పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటలో తామర పురుగులు కూడా ఆశించేందుకు అనుకూలం. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కోళ్ల యాజమాన్యం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కోళ్లలో కొక్కెర తెగులు సోకుటకు అనుకూలం. నివారణకు టీకాలు వేయించాలి. కోళ్ల వేడి వాతావరణాన్ని తట్టుకునేందుకు షెడ్లల్లో ఫ్యాన్లను , ఫాగార్స్‌ను అమర్చాలి. షెడ్లపై వరిగడ్డితో కప్పి స్ప్రింకర్లను అమర్చాలి. కోళ్లు ఎక్కువ మోతాదులో తినేందుకు అనుగుణంగా మెత్తటి దానాను పెట్టి తాగేందుకు చల్లటి నీనిని అందుబాటులో పెట్టాలి.

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా

'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. ఫోన్: 8332995392,

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

పంట మార్పిడి తప్పనిసరి

ఒక నేలలో ఒకే పంటను అనేకసార్లు పండించడం కంటే పంటను మారుస్తుంటేనే అధిక లాభాలు ఉంటాయి. ఒక పొలంలో ఎప్పుడూ వరి పంట పండిస్తుంటే నేలలో 5–15 సె.మీ లోతులో ఉన్న పొర నుంచి పోషకాలను తీసుకోవడం జరుగుతుంది. దీంతో ఆ పొర నిస్సారమవుతుంది. వరి తర్వాత వేరొక పంట వేస్తే అది వేరే పొర నుంచి వేరొక పరిమాణంలో పోషకాలను తీసుకుంటుంది. ఎప్పుడూ వరి పండిస్తుంటే కీటకాలు, శిలీంద్రాలు, సూక్ష్మంగా జీవులు తమ జీవిత చక్రాలను నిరాటంకంగా కొనసాగిస్తూ మరింత ఉధృతమవుతాయి. పంట పంటకు చీడపీడల బెడద పెరుగుతుంది. వరి తర్వాత వేరే పంట పండిస్తే వాటి జీవిత చక్రాలకు అంతరాయం ఏర్పడి చీడపీడలు తగ్గుతాయి. వరి పంట తరువాత చిక్కుడు జాతికి చెందిన పెసర, మీనుము, వేరుశనగ వంటి పంటలు వేస్తే వాటి వేర్లలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకొని నేలలో స్థిరీకరిస్తాయి. తరువాత పండించే వరి పంటకు ఆ నత్రజని లభ్యమవుతుంది. అదే విధంగా వరి పంట తర్వాత ఒక పచ్చిరొట్ట పంట, పిల్లిపెసర, జీలుగ, జనుము వంటి చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైర్లు పండించాలి. వీటి వేర్లలోని రైజోబియం నేలలో నత్రజనని స్థిరీకరిస్తాయి. పచ్చిరొట్టలోని నత్రజని వరి పంటకు అభ్యమవుతుంది. సేంద్రీయ పదార్థం చేరి నేల మెరుగుపడుతుంది. వరి తర్వాత నువ్వులు, పొద్దుతిరుగుడు, పత్తి, గోగు, కూరగాయలు మొదలైన వాణిజ్య పంటల్లో ఏదైనా ఒకటి పండిస్తే అధనపు ఆదాయం వస్తుంది. అందువల్ల వరి తరువాత వరి పండించకుండా పంటల మార్పిడి చేస్తే నష్టాలు తగ్గుతాయి. అధనపు లాబాలు అందుతాయి.

మగ్గక ముందే కోయాలి

మామిడి కాయలు చెట్లమీద మగ్గుతాయి. కానీ ఆ విధంగా మగ్గనివ్వకూడదు. ఎందుకంటే చెట్లపై కాయలు సమానంగా పండవు, రంగు కూడా పీలవంగా ఉంటుంది. నాణ్యత కూడా తక్కువగా ఉంటుంది. అనేక సార్లు కోయాల్సి ఉంటుంది. ఈ కారణాల వల్ల మామిడి కాయలను ఆకుపచ్చగా, గట్టిగా పక్వానికి రాగానే అవి మగ్గక ముందే కోసి కృత్రిమ పద్ధతుల ద్వారా పండిస్తారు.

వరి, బోద గడ్డి ఉపయోగించి మామిడి కాయలను మాగవేస్తారు. బయటి ప్రదేశాల్లో కోసిన కాయలను గుట్టలుగా పోసి వాటిని వరిగడ్డి లేదా బోదగడ్డితో కప్పుతారు. లేదా గాలి చొరబడని గదుల్లో నేలపై పర్చిన వరి లేదా బోదగడ్డి మీద మామిడి కాయలను వరుసగా పేర్చి మగ్గనిస్తారు. దక్షిణ భారత రాష్ట్రాలలో స్థానిక మార్కెట్ల కోసం ఈ పద్ధతిని ఇంకా ఉపయోగిస్తున్నారు. కర్ణాటక, మరి కొన్ని దక్షిణ ప్రాంతాలలో మామిడి కాయలను గదుల్లో ఉంచి పొగపెట్టడం ద్వారా కూడా మాగనిస్తారు. ఈ సాంప్రదాయ పద్ధతుల వల్ల కాయలు మగ్గడానికి చాలా రోజుల పడుతుంది.

ప్రస్తుత పద్ధతులు

సాంప్రదాయ పద్ధతిలో కోసిన కాయలు వివిధ పక్వ దశల్లో ఉండడం వల్ల అన్ని కాయలు సమంగా మగ్గవు. నిద్రవస్థలో ఉన్న నల్లమచ్చ తొడిమ కుళ్లు ఎక్కువై అపార నష్టాన్ని కలుగజేస్తాయి. అందువల్ల వాణిజ్య సరళిలో చేసే వర్తకంలో మామడిని కృత్రిమంగా రసాయనాల ద్వారా మాగనిస్తారు. ఈ పద్ధతిలో తొలి నుంచి కాల్షియం, కార్బైడ్ ఆ తర్వాత ఎథిలిన్‌ను ఉపయోగించి మామిడి కాయలను మగ్గనిస్తున్నారు.

కాల్షియం, కార్బైడ్‌తో మామిడి కాయలను మగ్గవేయడం:

కాల్షియం, కార్బైడ్‌తో పండిన పండ్లు ఆరోగ్యానికి హానికరం. వినియోగదారులకు విషంగా పని చేస్తాయి. వాటిని తినడం వల్ల మానవ శరీరంలో అవయవాలు దెబ్బతింటాయి. జీవన క్రియలు మందగిస్తాయి. శరీరంలో రక్షహీనత ఏర్పడుతుంది. మూత్రపిండాలు దెబ్బ తింటాయి. ఒక్కోసారి ఆరోగ్యం కోలుకోలేని విదంగా అవుతుంది.

ఇథలీన్ వాయువుతో పండ్లను మాగపెట్టే పద్ధతి:

ఇథిలీన్ వాయువును ఉపయోగించి పండ్లను మాగపెట్టుటకు ముఖ్యంగా మామిడి, అరటి, సపోట కాయలు పక్వానికి మూడో వంతు తయారై ఉండాలి. ఇథిలీన్ వాయువును ఉపయోగించుటకు ఇథిలీన్ రైపనింగ్ ఛాంబర్స్ ఏర్పాటు, వాణిజ్య పరంగా ఇథిలీన్ వాయువు లభ్యత గురించి రైతులకు, వ్యాపారస్తులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలి. మామిడి కాయలను రైపనింగ్ చాంపర్‌లో ఉంచి 100 నుంచి 150 పిపిఎం ఇథిలీన్ వాయువును ప్రవేశపెట్టి 12 నుంచి 24 గంటలు ఛాంబర్ తలుపులు తెరవకుండా ఉంచాలి. తరువాత కాయలు 4 నుంచి 5 రోజుల్లో మంచి రంగు సంతరించుకుని పక్వానికి వస్తాయి.